


## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

102

(15 డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**సరసంగా మాట్లాడటం,** సంతోషంతో పలకరించటం, సద్భావంతో సహకరించడం - ఇవన్నీ ఉత్తమలక్షణాలని పేర్కొంటారు పెద్దలు.

సరసంగా మాట్లాడటం, చమత్కారంగా జవాబు చెప్పడం గొప్పకళక్రింద జమకట్టవచ్చు. "సరసం ఒక విధమైన సిరి" అన్నారు పెద్దలు.

మొన్న ఒక పండిత మిత్రుడు మాట్లాడుతూ "ఇటీవల నేను బంధువుల ఇంటికి వెళ్ళాను. ఆ ఇంట్లో వున్న ముసలి దంపతులు, ఎప్పుడూ ముసి ముసి నవ్వులు నవ్వుతూ చమత్కారంగా మాట్లాడుతూ, ఒకరివంక చూసి ఒకరు సంబరాలు పడుతూ కనిపించారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఈ వయసులో ఇంత హుషారుగా ఎలా వుండగలిగారా? అని. ఎంత తమాషా అండీ" అన్నాడు.

"దాంట్లో తమాషా ఏం వుంది? దాంపత్యానికి అవసరమైన దినుసులు సంపాదించి వాడుకుంటున్నారన్నమాట. మనమంతా దిగుళ్ళ బేళ్ళల్లో మునిగిపడి వుంటాం. వాళ్ళు బయటపడి అలా వయస్సు కూడా మరచి అలా సీతాకోక చిలకల్లాగా ఎగురుతున్నారు" అన్నాను.

"ఏం సీతాకోకచిలకలండీ? చిన్న వయస్సులోవున్న నేనే అలా వుండలేనింట్లో. కాలేజీనుంచి ఇంటికి వెళ్ళేసరికే కళ్ళు ఎర్రబడతాయి. కాళ్ళు లాక్కు వస్తాయి. మనస్సు చెడివుంటుంది. అలాంటప్పుడు సరసాలేం జ్ఞాపకం వస్తాయి. ఎప్పుడు రెండు మెతుకులు పడేస్తారా అని మడత కుర్చీలో పడి మంచం వంక చూస్తూ వుండటం తప్ప. అసలలాటి చైతన్యం ఎలా వస్తుందండీ. నే వెళ్ళిన ఇంట్లో ఇల్లాలు నడవలేదనుకోండి. అన్నీ నాట్యభంగిమలు నవ్వుల మువ్వల చప్పుళ్ళూ" అని ఆయన ఎంతో దిగులుపడ్డాడు.

మా బంధువుల్లో ఒకాయన భార్యను "చిలకా! చిలకా" అని పిలుస్తూ వుంటాడెపుడూ. "ఇవ్వాళ ఉల్లిపాయ పులుసుపెట్టు చిలకా! చిల్లర డబ్బులేమైనా దాచావా చిలకా" ఇలా మాట్లాడుతూ వుంటారు. పాపం ఆయన బులపాటమేగానీ ఆ చిలక వట్టి కొయ్య చిలక. రోజుకొక్కసారి అన్నా "కూ" అనదు. భర్త చెప్పినా మాటలు తిప్పి చెప్పడం అసలే సున్నా. అయినా ఆయనగారి బంధువులొచ్చినా, పరాయివాళ్ళొచ్చినా "చిలక ప్రయోగం" వదిలిపెట్టడు పాపం.

వెనుకటికి మా మేనమామగారు అంటూ వుండేవారు. "ఆడపిల్లను పిలవడంలో చాలా జాగ్రత్త వుండాలి. ముద్దు పిలుపులకు పోతే వాటిని వెన్నముద్దలలాగా ఆరగించే నేర్పుండాలి. అలాంటి సరసం లేనిచోట ఆయ్! ఓయ్ అనడమే మంచిది. ఈ సత్యం గ్రహించకుండా చిలకా చిలకా అంటూ వెంటపడితే పిలకపట్టుకుని గుంజి వదిలిపెడతారు. 'చందమామా! చందమామా' అంటూ వెంటపడితే, నట్టింట్లో సావిట్లో అక్కరలేని చిందులు త్రొక్కడం ప్రారంభిస్తారు. సరసమెరిగిన చోట ఎన్ని సరిగమలైనా వాయించవచ్చు" అన్నాడు.

ప్రేయసిని చాలామంది "నా గులాబీ" "నా జిలేబీ" "నా తేనె" "నా బెడ్‌లైట్" "నా చిమ్నీ" "నా హోప్" "నా సోపు" అంటూ రకరకాలు పిలుస్తూ వుంటారు. ఇటీవల ఒక కథలో నాయకుడు ప్రేయసిని "నా రేషన్ కార్డు" అని సంబోధించాడు.

మా ఫ్రెండ్ ఒకాయన భార్యను ఎంతో సంబరంగా చూసుకుంటాడు. సిరి అంతా ఆవిడదేనని నమ్మకం. లక్ష్మి తన కళ్ళు వాళ్ళావిడ కిచ్చి గ్రుడ్డిదైందనీ, సరస్వతి గొంతు అందించి మూగదైందనీ ఆయన భ్రాంతి పాపం.

ఆవిడ పేరు కమల. ఆయనగారు నిత్యం 'కమలాష్టకం' వల్లిస్తూనే వుంటాడు. ఆవిడ ఎప్పుడో ఒకసారి ఒక చిరునవ్వు విసురుతుంది. "నరుడా! నీ పూజకు మెచ్చాను. నీకేం వరం కావాలో కోరుకో" అన్నట్లు.

ఇలా ఒకవైపునుంచి స్తోత్రపాఠాలు బయలుదేరడం, బ్లాంక్ పర్సులో పొగడ్తలు బయలుదేరడం సరసం క్రింద జమపడదు. ఒక వికార చేష్ట క్రింద పరిణమిస్తుందిగాని అది పరస్పరంగా వుండాలి.

సీత, రాముణ్ణి "ఆర్యపుత్రా" అని సంబోధిస్తే ఆయన మరింత గౌరవంతో "ఏమి భూపుత్రీ" అనేవాడు. అంతేగానీ "ఏమిటీ కౌసల్య కోడలా?" అంటే ఎంత తీసికట్టుగా వుంటుంది.

ఇలా తీసికట్టు పిలుపులు పిలవడం కూడా సరసమేననుకునే మహనీయులు కొందరులేక పోలేదు. మా వూళ్ళో ఫిప్పుఫారం తప్పిన పండితుడొకాయనున్నాడు. వాడికి కర్మం చాలక ఒక పాతికెకరాల పిత్రార్జితం వుంది. అందుకని ఎవరో ఆశపడి ఒక అందమైన పిల్లనిచ్చారు.

మరి ఆ అమ్మాయిని నీరసంగా పలకరించే సభ్యత ఎక్కడనుంచి వస్తుంది. పాతిక ఎకరాలలో సస్యం పండుతుందిగానీ, సభ్యత పండునా! ఆ సరసుడా అమ్మాయిని "ఎంకి" అని పిలిచేవాడు.

అక్కడితో ఊరుకునేవాడా? ఆ సంబోధన అక్కడితో వదిలితే లాభం లేదని "నాయుడు బావకి నీళ్ళు తోడు" అనీ, "నాయుడు బావకి రొట్టె కాల్చిపెట్టు"అనో అనడం అక్కడితో తను చక్కటి పోలికలు పోల్చానని తనలో తనే పొంగిపోయి తన్మయత్వంలో పడటం జరుగుతూ వుండేది.

బంధువులూ, స్నేహితులూ ఇంటికి వచ్చినప్పుడిలాటి బడాయి కూతలు హెచ్చు అవుతూ వుండేవి. ఆ అమ్మాయి చచ్చినట్లు పడుతూ వుండేది. ఇదోరకం సరసం. బొత్తిగా ఇరవయ్యో నెంబరు నూలు.

గ్రాంథిక భాషలో ప్రేయసుల్ని, ఒక్కొక్కప్పుడు భార్యల్ని పిలవడంలో ఎంతో సరసం, సభ్యతా గోచరిస్తాయి. ఇలాటి పిలుపుల్లో కవిత్వంతోపాటు కాంక్ష కూడా దాగిదోచూచులాడుతూ వుంటుంది.

"కాసిని మంచినీళ్ళు తెస్తావా మృగనయనా! ఇవ్వాళ పచ్చడిలో ఉప్పు చాలలేదే ఉల్లాసలాస్య తరంగిణీ" "నా మాడును కొంచెం నూనె అంటుతావటే మరాళకుంతలా"

ఇలాటి ప్రయోగాల వల్ల కొంత కొంత ఉబలాటం, అర్థంకాని ఆనందం వెల్లివిరుస్తూ వుంటాయి. ఆమె కూడా పండితురాలైతే ఇక ఆ సంభాషణలు చెప్పనక్కరలేదు. ఏ పాట్య గ్రంథంలోనో, వారిరివురి జీవిత చరిత్రలతో ప్రవేశిస్తాయి. గైడ్సు ఆ సంభాషణలలో గల చాతుర్యాన్ని, కవి సమయాన్ని, నిశిష్టార్థాన్ని మిక్కిలిగా వివరిస్తాయి.

ఇలాటి సంబోధనల విషయంలో మా ఉష్శ్రీగారిని పేర్కొనాలి. ఆయనగారిటీవల పత్రికలలో వ్రాసే వ్యాసాలు చాలావరకూ "ప్రేయసికి నివేదనలు"గా రూపొందుతున్నాయి. అందులో ఆయన ఎన్నుకుంటున్న సంబోధనలు చాలా సుబోధకంగా, సరసంగా, చమత్కార పూరితంగా వుంటున్నాయి. ఆయన 'ప్రేయసిని' గౌరవించడంలో గారవించడంలో పరిపూర్ణమైన సిద్ధిపొందారనిపిస్తుంది. అనిపించడమేమిటి? పొందారు.

Post your comments